# డల్లాస్‌లో టాంటెక్స్ 'తెలుగు వెన్నెల'



డల్లాస్, మే 20 : ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం (టాంటెక్స్) వారి తెలుగు సాహిత్య వేదిక నిర్వహించే ''నెల నెలా తెలుగు వెన్నెల'' పదవ సమావేశం కన్నుల పండువగా జరిగింది. డల్లాస్ నగరంలోని హిందూ దేవాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో సాహితీప్రియులు హాజరయ్యారు. ఈ సభకి తానా కార్యదర్శి ప్రసాద్ తోటకూర అధ్యక్షత వహించగా, డల్లాస్ నగరానికి చెందిన ప్రముఖ నియోనాటాలజిస్ట్ డాక్టర్ నక్తా రాజు ప్రధాన వక్తగా ఉపన్యసించారు.

శంకరమంచి సత్యం రచించిన అమరావతి కథలు అనే అంశంపై నక్తా రాజు ఆకట్టుకునే ప్రసంగం చేశారు. సాహితీ వేదిక వ్యవస్థాప సభ్యుడు ఎమ్వీయెల్ ప్రసాద్, ముఖ్య అతిథి డాక్టర్ వక్తా రాజును సభకు పరిచయం చేశారు. డాక్టర్ రాజు అమరావతి కథల సంకలనం నుండి పదికి పైగా కథల్ని విశ్లేషిస్తూ కృష్ణానది పరిసర ప్రాంతాల్ని అమరావతి గ్రామీణసౌందర్యాన్ని కళ్ళకు కట్టినట్టుగా వర్ణించారు. ఒక్కో కథ సారాంశాన్ని వివరిస్తూ ప్రస్తుత సమాజంలో తరిగిపోతున్న అనుబంధాల్ని, పెరిగిపోతున్న అంతరాల్ని అమరావతి కథల కోణంలో విశ్లేషించారు.



తర్వాత సాహితీ వేదిక సభ్యుడు అనంత్, మల్లవరపు రాయప్రోలు రచించిన గేయాల్ని ఆలపించగా, ఈశ్వర రామజోగరావు తన మాతృమూర్తికి అంకితమిస్తూ రాసిన కవితను చదివారు. సుద్దాల శ్రీను కారు కూతలు శీర్షికతో తాను రచించిన సరదా కవితల్ని వినిపించగా, జువ్వాడి రమణ విశ్వనాద రచన నుండి శివధనుర్భగం ఘట్టాన్ని వర్ణించారు. ఆచార్య పూదూర్ జగదీశ్వరన్ శ్రీనాధ కవి విరచితమైన శివరాత్రి మహోత్సవంలోని కొన్ని రసవంతమయిన ఘట్టాల్ని వర్ణించి శ్రోతల్ని అలరించారు. సూరిభొట లక్ష్మి అమ్మ మీద తాను రాసిన కవిత వినిపించగా, తాడిమేటి రాధిక మంచు మీద

తాను రాసిన కవితను వినిపించారు.

అనంతరం డాక్టర్ నక్తా రాజును టాంటెక్స్ సంస్థ ప్రెసిడెంట్- ఎలక్ట్ శ్రీధర్ కొర్శపాటి, కార్యవర్గ సభ్యుడు అనంత్ మల్లవరపు పుష్పగుచ్చాలతో, జ్ఞాపికతో సత్కరించగా, ఎమ్వీయెల్ ప్రసాద్ శాలువ కప్పి సన్మానించారు. అన్నపూర్ణ చిలుకూరు, శాంత పులిగండ్ల, ఆచార్యజగదీశ్వరన్, పులిగండ్ల విశ్వనాధం, ఎమ్వీయెల్ ప్రసాధ్, గీతా దమ్మన్న, రావ్ తదితరులు పాల్గోన్న ఈ సభ అనంత్ మల్ల వరపు వందన సమర్పణతో ముగిసింది.